## క్లుప్తంగా

### రైతుల సమస్యలపై చర్చ

**ఖమ్మంవ్యవసాయం:** రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై సంయుక్త కిసాన్ మోర్చా(నాన్ పొలిటికల్) ఆధ్వర్యాన గురువారం పంజాబ్ రాష్ట్రంలోని లూథియానాలో చర్చించారు. భూసేకరణ చట్టం, ప్రపంచ వాణిజ్య ఒప్పందం, స్వామినాథన్ కమిషన్ ఆమోదం, మద్దతు ధరలకు చట్టబద్ధత తదితర అంశాలపై చర్చించగా వివిధ రాష్ట్రాల ప్రతినిధులు హాజరయ్యారు. ఇందులో జిల్లాకు చెందిన నల్లమల వెంకటేశ్వరరావు కూడా పాల్గొన్నారు.

### జరిమానా..

**ఖమ్మంమయూరిసెంటర్:** సాధారణ వ్యర్థాల్లో మెడికల్ వ్యర్థాలను వేసి చెత్త సేకరణ వాహనాలకు అందిస్తున్న ఓ ఆస్పత్రికి కేఎంసీ అధికారులు రూ.15వేల జరిమానా విధించారు. ఇంజక్షన్లు, ఇతర మెడికల్ వ్యర్థాలను గమనించిన పారిశుద్ధ్య సిబ్బంది అధికారులకు తెలుపగా.. కేఎంసీ అధికారులు జరిమానా విధించారు. మెడికల్ వ్యర్థాలను సేకరించే వారికే అందించాలని సూచించారు. అలాగే, కమర్షియల్ వ్యర్థాలను రోడ్డు వెంట పోస్తున్న వ్యక్తిని గుర్తించి రూ.2 వేల జరిమానా విధించారు.

### రక్షాబంధన్ వేడుకలు


రాఖీ కడుతున్న విద్యార్థినులు

**తిరుమలాయపాలెం:** మండలంలోని తిరుమలాయపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విద్యార్థినిలు రాఖీలు కట్టారు. అనంతరం విద్యార్థులకు ఉపాధ్యాయులు రక్షాబంధన్ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం విజయకుమారి, ఉపాధ్యాయులు పెసర ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఇనుప గేట్ల చోరీపై కేసు

**తిరుమలాయపాలెం:** మండలంలోని గోల్‌తండా స్టేజీ సమీపాన ఓ రైతు వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసిన ఇనుప గేట్ల చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఖమ్మంకు చెందిన రైతు ముజీబ్ అహ్మద్ గోల్‌తండా జిన్నింగ్ మిల్లు పక్కన తన వ్యవసాయక్షేత్రంలో ఫెన్సింగ్‌తో పాటు రూ.1.20లక్షలతో ఇనుప గేట్లు ఏర్పాటు చేయించాడు. ఈ గేట్లను బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది.

### పాము కలకలం

**ఖమ్మం లీగల్:** నగరంలోని బార్ అసోసియేషన్ హాల్‌లో గురువారం పాము కలకలం సృష్టించింది. స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని హాల్‌లో సాయంత్రం నిర్వహించిన చెస్, క్యారమ్స్ పోటీలకు న్యాయవాదులు హాజరు కాగా పాము కనిపించడంతో భయాందోళనకు గురై బయటకు పంపారు.

### బాధ్యతలు స్వీకరణ

**కూసుమంచి:** మండలంలోని చేగొమ్మ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా బడేటి శ్రీనివాసరావు గురువారం తిరిగి బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ఈ సహకార సంఘ పాలకవర్గాన్ని రద్దు చేస్తూ వ్యవసాయ, సహకార శాఖల కమిషనర్ రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీ చేయగా.. దీన్ని సవాల్ చేస్తూ చైర్మన్‌తో పాటు మరికొందరు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో విచారణ చేపట్టిన కోర్టు పాలకవర్గాన్ని కొనసాగించాలని ఆదేశాలు ఇవ్వడంతో జిల్లా సహకార శాఖ అధికారి గంగాధర్ ఉత్తర్వుల మేరకు చైర్మన్‌గా శ్రీనివాసరావు తిరిగి బాధ్యతలు స్వీకరించారు.

### నగరంలో సినిమాలు

| | |
|---|---|
| తిరుమల | కింగ్‌డమ్ |
| వినోద | మహా అవతార్ నర్సింహ |
| సాయిరాం | బకాసుర రెస్టారెంట్ |
| ఆదిత్య | సు ఫ్రం సో |
| శ్రీనివాస | సాయారా, కింగ్‌డమ్ |

\- ఖమ్మంగాంధీచౌక్

### ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

| కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో) | | ఆకుకూరల కట్టలు (రూ.ల్లో) | |
|---|---|---|---|
| టమాట | 54 | బచ్చలికూర | 4 |
| వంకాయ | 30 | | 20 |
| బెండకాయ | 30 | పాలకూర | 3 |
| పచ్చిమిర్చి | 50 | | 20 |
| కాకర | 40 | చుక్కకూర | 3 |
| బోడ కాకర | 160 | | 20 |
| బీర | 36 | తోటకూర | 4 |
| దొండ | 36 | | 20 |
| పొట్లకాయ | 36 | గోంగూర | 4 |
| చిక్కుడు | 56 | | 20 |
| గోరుచిక్కుడు | 46 | మెంతికూర | 3 |
| క్యాబేజీ | 24 | | 20 |
| క్యాలీఫ్లవర్ | 45 | కొత్తిమీర | 1 |
| ఆలుగడ్డ | 26 | | 25 |
| చామగడ్డ | 32 | పుదీన | 1 |
| క్యారెట్ | 46 | | 20 |
| బీట్‌రూట్ | 36 | -ఖమ్మం వ్యవసాయం | |

# ఇక పైసా వసూల్..

**ఆస్తి పన్నులపై స్పెషల్ ఫోకస్**
- డిసెంబర్ నాటికే పూర్తయ్యేలా కసరత్తు
- బకాయిల వసూళ్లపై అధికారుల దృష్టి
- యజమానులకు నోటీసులు జారీ

ఖమ్మం నగరం వేగంగా అభివృద్ధి చెందుతోంది. కొత్త రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ, పార్కులు, లైటింగ్ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు భారీగా నిధులు ఖర్చు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసే గ్రాంట్స్‌తో పాటు ఆస్తి పన్ను ద్వారా కేఎంసీకి వస్తున్న ఆదాయం కీలకంగా మారింది.


నోటీస్ అందజేస్తున్న కేఎంసీ అధికారులు

**ఖమ్మంమయూరిసెంటర్:** గత మూడేళ్లుగా ఖమ్మం నగర పాలక సంస్థలో ఆస్తి పన్ను రూ.30 కోట్లకు పైగా వసూళ్లవుతుండడంతో ఉద్యోగుల వేతనాలు, పారిశుద్ధ్య నిర్వహణ ఖర్చులు, అత్యవసర అవసరాలకు ఈ నిధులు ఉపయోగపడుతున్నాయి. దీంతో ఈ ఏడాది పన్నులను ఆర్థిక సంవత్సరం చివరి వరకు కాకుండా డిసెంబర్ నాటికే వసూళ్లు చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి కేఎంసీ అధికారులను ఆదేశించారు.

**పకడ్బందీగా వసూళ్లు..**

ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో 82,076 అసెస్మెంట్లు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.31.64 కోట్లు పన్నులు వసూలు చేయాల్సి ఉండగా.. గత బకాయిలు రూ.14.60 కోట్లు ఉన్నట్లు తెలిసింది. పాత బకాయిలు, ఈ ఏడాది లక్ష్యం కలుపుకొని మొత్తం రూ.57.90 కోట్లు ఆస్తి పన్నులు వసూలు చేయాల్సి ఉన్నట్లు ఇటీవల కలెక్టర్ కేఎంసీలో నిర్వహించిన సమావేశంలో అధికారులకు వెల్లడించారు. ఆస్తి పన్ను బకాయిలు రూ.14 కోట్లకు పైగా ఉండడంతో వాటిని పూర్తిగా వసూలు చేయాలని ఆదేశించగా.. వసూళ్లపై అధికారులు కసరత్తు చేస్తున్నారు.

**నోటీసులు జారీ..**

కలెక్టర్ ఆదేశాలు, కేఎంసీ కమిషనర్ సూచనలతో పన్నుల వసూళ్లపై రెవెన్యూ విభాగ అధికారులు దృష్టి సారించారు. పాత బకాయిలతో పాటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్నులు కూడా వెంటనే చెల్లించాలని నోటీసులు జారీ చేస్తున్నారు. పాత బకాయిదారులకు రెడ్ నోటీసులు, ఈ ఏడాది చెల్లించాల్సిన వారికి రిమైండ్ చేస్తూ వైట్ నోటీసులు జారీ చేస్తున్నారు. నగరంలో ఇప్పటి వరకు 25,457 నోటీసులు జారీ చేశారు. వార్డు ఆఫీసర్లు, బిల్లు కలెక్టర్లు ఈ నోటీసులను ఇంటి యజమానులకు అందజేస్తున్నారు. నోటీసులు అందిన తర్వాత పన్ను చెల్లించని బకాయిదారులపై మరింత కఠినంగా వ్యవహరించాలని అధికారులు నిర్ణయించినట్లు తెలిసింది.

| | |
|---|---|
| ఇప్పటి వరకు వసూలు చేసిన పాత బకాయిలు (పెనాల్టీతో) | రూ.11.76 కోట్లు |
| ప్రస్తుత సంవత్సరానికి సంబంధించిన పన్నుల వసూలు | రూ.89.75 లక్షలు |
| వసూలైన మొత్తం పన్నులు | రూ.12.66 కోట్లు |
| చేయాల్సిన పన్నులు | రూ.45.24 కోట్లు |

**ఖాళీ సమయంలోనే..**

పన్నుల వసూళ్లలో బిల్లు కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లది కీలకం. వీరికి అదనపు పని బాధ్యతలు లేని సమయంలోనే ఆస్తి పన్నులు వసూళ్లు చేయించాలని అధికారులు నిర్ణయించారు. ఎన్నికలు, వరదలు, సర్వేలు తదితర కారణాలతో గత రెండేళ్లు వీరు పన్నుల వసూళ్లపై పూర్తి స్థాయిలో దృష్టి సారించలేకపోయారు. ఈ కారణాలతో ఆర్థిక సంవత్సరం చివరి రెండు మూడు నెలల్లోనే పన్నులను వసూలు చేసేందుకు తీవ్రంగా శ్రమించారు. అయితే ఈ ఏడాది అలా జరగకుండా ఉండేందుకు సిబ్బంది ఖాళీగా ఉన్న సమయంలోనే పన్నులు వసూలు చేయిస్తే లక్ష్యాలను సులువుగా అధిగమించవచ్చనే ఆలోచనలను చేశారు. బకాయిలు సకాలంలో పూర్తయితే కేఎంసీపై ఆర్థిక భారం తగ్గుతుందని భావిస్తున్నారు.

## శ్రావణ శోభ..



శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని నగరంలోని 11వ డివిజన్ చైతన్యనగర్ మైసమ్మ అమ్మవారిని గురువారం రాత్రి భక్తులు 25 రకాల పండ్లు, కూరగాయాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. వనసంపదను ఆరాధనలో భాగంగా ఆలయ ఈఓ కాముని శ్రీకాంత్ నేతృత్వాన అలంకరించగా.. పలువురు ప్రశంసించారు.

– ఖమ్మంఅర్బన్

## ‘ఉపాధి’లో అక్రమాలు సహించం..

- రూ.86,069 రికవరీకి ఆదేశాలు
- ప్రజావేదిక ముగింపులో డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ శిరీష


ఫిర్యాదులు పరిశీలిస్తున్న ఏపీడీ శిరీష

**నేలకొండపల్లి:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి సామాజిక తనిఖీ నివేదికలపై ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావేదిక గురువారంతో ముగిసింది. రెండు రోజుల పాటు జరిగిన ఈ ఫోరమ్‌లో పంచాయతీల్లో జరిగిన అవకతవకలకు సంబంధించి రికవరీకి ఆదేశించారు. మండలంలోని 32 జీపీల్లో గతేడాది ఏప్రిల్ నుంచి 31, మార్చి 2025 వరకు జరిగిన పనులపై సమగ్రంగా విచారించగా.. పలు గ్రామాల మస్టర్ల నమోదులో దిద్దుబాటు ఉన్నట్లు గుర్తించారు. మరికొన్ని పంచాయతీల్లో ఉపాధి నిధులతో నాటిన మొక్కలు ఎండిపోయినట్లు తేలింది. పంట కాలువలు చెత్తచెదారంతో నిండి ఉన్నట్లు నివేదికలో వివరించారు. ఉపాధి పథకం క్షేత్ర సహాయకులకు రూ.47వేల జరిమానా, రూ.26,102లను రికవరీ చేయాలని, పంచాయతీరాజ్ శాఖ నుంచి రూ.12,967 ఇలా మొత్తం రూ.86,069లను రికవరీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ పీడీ శిరీష మాట్లాడుతూ.. ఉపాధిలో అక్రమాలను సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ శ్రీదేవి, అంబుస్‌మెన్ రమేష్, డీవీఓ సక్రియ, ఏవీఓ పవన్, వీరయ్య, ఎస్ఆర్‌పీ చెన్నకేశవులు, ఎంపీడీఓ ఎం.యర్రయ్య, ఎంపీఓ శివ, పంచాయతీరాజ్ ఏఈ ప్రసాద్, ఈజీఎస్ ఏపీఓ సునీత, ఈసీ శేష గిరిరావు పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ తరలిన మేయర్ బృందం


సీడీఎంఏకు వినతిపత్రం అందజేస్తున్న మేయర్ నీరజ, కార్పొరేటర్లు

**ఖమ్మంమయూరిసెంటర్:** నగరంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవసరమైన నిధులను మంజూరు చేయాలని కోరుతూ మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్ల బృందం గురువారం హైదరాబాద్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సీడీఎంఏ టీ.కే.శ్రీదేవిని కలిశారు. తొలుత మంత్రి తుమ్మలను కలిసి నగరంలో చేపట్టాల్సిన పనులకు అవసరమైన నిధులను ప్రతిపాదించారు. అనంతరం సీడీఎంఏను కలిసి కేఎంసీలో అభివృద్ధి పనులకు రూ.2 వేల కోట్లు నిధులు అవసరమవుతాయని వివరించి వినతిపత్రం అందజేశారు. ఇందులో నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ నిర్మాణానికి రూ.1,200 కోట్లు, స్టోమ్ వాటర్ డ్రైయినేజీకి రూ.250 కోట్లు, మంచినీటి సరఫరా కోసం రూ.220 కోట్లు, 24 గంటల మంచినీటి సరఫరా కోసం రూ.155 కోట్లు, అభివృద్ధి పనులకు రూ.150 కోట్లు అవసరం ఉన్నట్లు తెలిపారు. ఇక ఎల్ఆర్ఎస్ నిధుల నుంచి రూ.60 కోట్లు వినియోగానికి అనుమతించాలని వినతిలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహర, కార్పొరేటర్లు రాపర్తి శరత్, కన్నం వైష్ణవి ప్రసన్నకృష్ణ, ఆళ్ల నిరీష, లక్ష్మి, కొత్తపల్లి నీరజ, పాకలపాటి విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు.

## అవెన్యూ ప్లాంటేషన్ పనులు ప్రారంభం

**నేలకొండపల్లి:** అవెన్యూ ప్లాంటేషన్ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఎంపీడీఓ ఎం.యర్రయ్య సూచించారు. మండలకేంద్రం మేజర్ పంచాయతీలో అవెన్యూ ప్లాంటేషన్ పనులను గురువారం ప్రారంభించాక మాట్లాడారు. మేజర్ పంచాయతీలో 500 మొక్కలు నాటేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ పంచాయతీలో అవెన్యూ ప్లాంటేషన్ పనులు ప్రారంభించాలని, నర్సరీలో మొక్కల సంరక్షణను బాధ్యతగా తీసుకోవడంతో పాటు ప్రతీ మొక్కకు లెక్క ఉండాలని సూచించారు. మేజర్ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ సమావేశాలు..


సమావేశంలో మాట్లాడుతున్న శాండిల్య

**ఖమ్మంగాంధీచౌక్:** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) స్టాఫ్ యూనియన్ హైదరాబాద్ సర్కిల్ వర్కింగ్ కమిటీ రెండు రోజుల సమావేశాలు గురువారం నగరంలోని శ్రీశ్రీ హోటల్‌లో ప్రారంభమయ్యాయి. ఈ సమావేశాల్లో యూనియన్ ప్రెసిడెంట్ శ్రీధర్, ప్రధాన కార్యదర్శి శాండిల్య ముఖ్య అతిథులుగా పాల్గొని బ్యాంకింగ్ రంగంలో జరుగుతున్న కీలక పరిణామాలు, చట్టాల ఉల్లంఘన, పనిభారం, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు తదితర అంశాలతో పాటు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై వివరించారు. ఖమ్మం రీజినల్ యూనియన్ కార్యదర్శి పి.చిన్నప్పరెడ్డి తదితరుల ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో నల్లగొండ మాడ్యూల్ వైస్ ప్రెసిడెంట్ కేఎస్ నందన్ పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా ఆయనను సన్మానించారు. రాష్ట్రం నలుమూలల నుంచి 100 మంది ప్రతినిధులు ఈ సమావేశాల్లో పాల్గొన్నారు.

## ధాన్యం ఆరబెట్టే యంత్రం కొనుగోలు

**నేలకొండపల్లి:** స్థానిక వ్యవసాయ మార్కెట్ కోసం రూ.13.70లక్షలతో వడ్లను డ్రై చేసే మిషన్‌ను కొనుగోలు చేసినట్లు కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు పేర్కొన్నారు. గురువారం మార్కెట్ యార్డ్‌లో మిషన్‌ను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. వర్షాకాలంలో రైతులు వడ్లను ఎండబెట్టుకునేందుకు వీలుగా.. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు రూ.13.70 లక్షలతో మిషన్‌ను కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎం.రాధ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, రాజేశ్వరపురం మాజీ సర్పంచ్ ఎర్రబోయిన నర్సయ్య, మాజీ ఉప సర్పంచ్ చిట్యాల రమేష్, మార్కెట్ సూపర్‌వైజర్ భాస్కర్‌రావు, ఏఈఓ అరవింద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ వైద్యులకు శిక్షణ ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

**ఖమ్మంరూరల్:** గ్రామీణ వైద్యులకు శిక్షణతో పాటు సర్టిఫికెట్లు అందించి చట్టబద్ధంగా రక్షణ కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని రెడ్డిపల్లిలో గురువారం జరిగిన ఆర్ఎంపీల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైన ప్రాథమిక వైద్యం చేస్తున్న ఆర్ఎంపీలపై టీజీఎంసీ దాడులు జరుగుతున్నాయని, ఎవరో ఒకరిద్దరు చేసిన తప్పులకు అందరినీ ఆగాడిన కట్టి అలుసుగా చూడడం తగదన్నారు. దీనిపై విచారణ జరిపించి అసలైన ఆర్ఎంపీలకు న్యాయం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు పి.నాగేశ్వరరావు, వెంకటాచారి, ఎస్.మణికుమార్, సుదర్శన్, చంద్రారెడ్డి, ఎల్. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## నగర సమస్యలపై దృష్టి సారించాలి


సమావేశంలో మాట్లాడుతున్న విక్రమ్

**ఖమ్మం మామిళ్లగూడెం:** నగర సమస్యలపై మేయర్, కమిషనర్ దృష్టి సారించాలని సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ డిమాండ్ చేశారు. గురువారం ఖమ్మం సుందరయ్య భవన్‌లో మాజీ కౌన్సిలర్ నర్రా రమేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలోని పాత మున్సిపాలిటీ నుంచి రిక్కా బజార్ మీదుగా చర్చి కాంపౌండ్ వరకు రహదారి విస్తరణ ప్రారంభించి కొన్ని నెలలు అవుతున్నా.. పనులు పూర్తి చేయకపోవడంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని విమర్శించారు. అలాగే ఏడాది క్రితం ప్రారంభమైన రఘునాథపాలెం పోలీస్ స్టేషన్ నుంచి ఇల్లెందు రోడ్డు పనులు, అల్లిపురం–కొత్తగూడెం రోడ్డు, రైల్వే స్టేషన్ రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. ఖమ్మం బస్సు డిపో రోడ్డు వెడల్పు చేసి, మధ్యలో ప్యాచ్ వర్క్ చేయాలని డిమాండ్ చేశారు. విలీన ప్రాంతాల్లో డ్రెయినేజీ, వీధిలైట్లు, రహదారి పనులు కోసం తగిన నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని, రేషన్ కార్డులు, ఇంటి స్థలాలు, పెన్షన్లు తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టూటౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, భద్రం, వీరబాబు, మచ్చా సూర్యం, బి.రవీంద్ర, హుస్సేన్, ఎస్.కుమారి, రాజేష్, మల్లికార్జున్‌రెడ్డి, పకీరు సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

**మూడో రోజుకు చేరిన క్రికెట్ టోర్నీ**

**ఖమ్మం స్పోర్ట్స్:** రాజీవ్ గాంధీ స్మారక క్రికెట్ పోటీల్లో భాగంగా అండర్–12 పోటీలు గురువారం మూడో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఎస్ స్కూల్ – డాక్టర్ చక్రి స్కూల్ జట్ల మధ్య మ్యాచ్‌లో డాక్టర్ చక్రి స్కూల్, రెండో మ్యాచ్‌లో చైతన్య స్కూల్– శ్లోక స్కూల్ పోటీ పడగా..శ్లోక స్కూల్, మూడో మ్యాచ్‌లో ఆదిత్య స్కూల్ – త్రివేణి స్కూల్ మధ్య మ్యాచ్‌లో త్రివేణి స్కూల్ జట్లు విజయం సాధించాయి. మ్యాచ్‌లను సీపీఎం నాయకుడు విక్రమ్ ప్రారంభించారు. టోర్నీ నిర్వాహకులు ఎం.డీ.మతిన్ తదితరులు పాల్గొన్నారు.

## డొంక, కాల్వ భూమి ఆక్రమణ విఫలయత్నం


చదును చేసిన రోడ్డు, కాల్వ భూమి

**ఖమ్మంఅర్బన్:** ఖమ్మం కొత్తగూడెం సమీపాన కాల్వ భూమితో పాటు దానిని ఆనుకుని రోడ్డు ఆక్రమణకు ఓ వ్యాపారి చేసిన ప్రయత్నాన్ని స్థానిక రైతులు గురువారం అడ్డుకున్నారు. ఎస్‌బీఐటీ కాలేజీ సమీపం నుంచి అల్లీపురం – కొత్తగూడెం ప్రధాన రోడ్డుకు అనుసంధానంగా 63 అడుగుల దారి ఉంది. ఇందులో కొంతమేర ఆక్రమించి గోడ నిర్మాణానికి ఓ వ్యాపారి కందకం తీస్తుండగా రైతులు, స్థానికులు అడ్డగించారు. ఆపై కేఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు పనులు నిలిపివేయించారు. అంతేకాక తవ్వకం చేపట్టిన వారితోనే కందకం పూడ్పించారు.

## చేనేత కార్మికులకు సన్మానం


కార్మికులను సన్మానిస్తున్న సంఘం బాధ్యులు

**ఖమ్మం మామిళ్లగూడెం:** జాతీయ చేనేత కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా అభ్యుదయ పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యాన ఖమ్మం విజయ నర్సింగ్ హోమ్ దగ్గర కార్యాలయంలో గురువారం చేనేత కార్మికులు కాటబత్తిని నాగేశ్వరరావు, కోరట్ల నారాయణ తదితరులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘ జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ వెలిగేటి చంద్రమోహన్ మాట్లాడుతూ.. ప్రభుత్వం చేనేత కార్మికులకు ఆదుకోవాలని కోరారు. జిల్లా వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో జి.సూర్యప్రకాష్‌రావు, గడదాసు రవిందర్, గజేంద్రుల నాగేశ్వరరావు, అనాసి రాధాకృష్ణ, రచ్చ రామారావు, ఊరుకొండ సైదులు, పంతంగి ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలను సంరక్షించాలి


మొక్కలను పరిశీలిస్తున్న అధికారి రాధిక

**ఖమ్మంమయూరిసెంటర్:** కేఎంసీ పరిధిలోని డంపింగ్‌యార్డు ప్లాంటేషన్‌లో ఉన్న మొక్కలను సంరక్షించాలని హార్టికల్చర్ ఆఫీసర్ బి.రాధిక అన్నారు. గురువారం డంపింగ్‌యార్డులోని ప్లాంటేషన్‌ను పరిశీలించి మొక్కల పెరుగుదల, వాటి సంరక్షణ, నీటి సరఫరా వంటి అంశాలను సమీక్షించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. పర్యావరణ హితానికి అనుగుణంగా మొక్కలను సంరక్షిస్తూ, మరింత హరిత వాతావరణం ఏర్పరచేందుకు అవసరమైన సూచనలు అందించారు. నాణ్యమైన నిర్వహణ ఉంటే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ఖమ్మంఅర్బన్:** నగరంలోని 11 కేవీ డెయిరీ ఫీడర్ విద్యుత్ లైన్ మరమ్మతుల దృష్ట్యా నేడు(శుక్రవారం) ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏడీ యాదగిరి ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫీడర్ పరిధిలోని పోలీస్‌కాలనీ, నేతాజీనగర్, ఓల్డ్ సుడా చైర్మన్ బజార్ పరిధిలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

## బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

**కూసుమంచి:** బీజేపీతోనే కేంద్రంలో, రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని పార్టీ రాష్ట్ర నాయకుడు దేవకి వాసుదేవరావు అన్నారు. గురువారం రాత్రి కూసుమంచిలో నిర్వహించిన మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను గడపగడపకు వెళ్లి కరపత్రాల ద్వారా తెలియజేస్తూ కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల వైఫల్యాలను వివరించారు. ప్రజలు బీజేపీ పక్షాన నిలిచి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాలేరు ఇన్‌చార్జ్ నున్నా రవికుమార్, నాయకులు ఈవీ రమేష్, గడ్డం వెంకటేశ్వర్లు, రవి రాథోడ్, మహేందర్‌నాయక్, వీరన్న, శంకర్, వినోద్, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్లపై బీజేపీ తీరు హాస్యాస్పదం

**ఖమ్మంమామిళ్లగూడెం:** బీసీ రిజర్వేషన్లలో ముస్లింలకు వాటా ఇవ్వొద్దని బీజేపీ నేతలు చెప్పడం హాస్యాస్పదమని ఖమ్మం జిల్లా వక్ఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఎస్‌డి.నబీహుస్సేన్, జనరల్ సెక్రటరీ ఎస్‌కె.జాని అన్నారు. గురువారం ఖమ్మంలో జిల్లా సమావేశంలో వారు మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్లపై తొలిసారిగా కాంగ్రెస్‌ప్రభుత్వం తీర్మానం చేసిందని, బీజేపీ పాలిత ప్రాంతాలైన గుజరాత్, ఉత్తరప్రదేశ్‌లలో ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లు అమలులో ఉన్నాయని, ఇక్కడ ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్నించారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ఈ బిల్లు పాస్ అయ్యేలా ఎంపీలు చూడాలని కోరారు. ఈ సమావేశంలో గఫార్, ఖమర్, నవీద్, తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

## వరినాట్లు.. ముమ్మరం



మండలంలో వరినాట్లు జోరుగా సాగుతున్నాయి. చెరువులు, కుంటల్లో నీరు సరిపడా ఉండడంతో భూగర్భ జలాలు పెరిగి సాగు నీటికి ఇబ్బందులు తప్పాయి. దీంతో చెరువులు, బోరు, బావుల కింద వరి సాగు ముమ్మరంగా సాగుతోంది. గతంలో 4 వేల ఎకరాలకు మించని వరిసాగు భక్త రామదాసు ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందడంతో 13 వేల ఎకరాలకు పెరిగింది. మెట్ట ప్రాంతాల్లోనూ వరినాట్లు వేస్తున్నారు.

– తిరుమలాయపాలెం